
# సొంతింటి కల సాకారం

- అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట
- ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి
- పలు అభివృద్ధి పనులు ప్రారంభం



మాందాపూర్‌లో భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి

జగదేవ్‌పూర్, అక్టోబర్ 7 : పేదోడి సొంతింటి కల సాకారం చేసే దిశగా అర్హులందరికీ సీఎం కేసీఆర్ గృహలక్ష్మి పథకం వర్తింపజేయనున్నట్లు ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని పలుగుగడ్డ, మాందాపూర్, బీజీ వెంకటాపూర్, మునిగడప, జగదేవ్‌పూర్ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు ప్రారంభించడంతోపాటు శంకుస్థాపనలు చేశారు. పలుగుగడ్డ గ్రామంలో గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించి, అంగన్‌వాడీ భవన నిర్మాణానికి సర్పంచ్ రాజేశ్వరి రవి, ఎంపీటీసీ కిరణ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. మాందాపూర్‌లో నూతన గ్రామ పంచాయతీ భవనానికి సర్పంచ్ భిక్షపతితో కలిసి శంకుస్థాపన చేశారు. బీజీవెంకటాపూర్ గ్రామంలో ఫంక్షన్ హాల్‌ను సర్పంచ్ మంజులారమేశ్‌తో కలిసి ప్రారంభించి ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. మునిగడప, బీజీ వెంకటాపూర్‌లో లబ్ధిదారులకు గృహలక్ష్మి ప్రొసీడింగ్ కాపీలను అందజేసి కేసీఆర్ క్రీడాకిట్లను యువకులకు అందజేశారు. జగదేవ్‌పూర్‌లో షాదీఖానా భవనానికి మండల కో–ఆప్షన్ సభ్యుడు ఎక్బాల్, ముస్లింలతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమంతో పల్లెలను ప్రగతి వైపు నడిపిస్తున్నారన్నారు. రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పేదల ఆర్థిక పురోగతికి కృషి చేస్తున్నారని చెప్పారు. క్రీడలను ప్రోత్సహించే విధంగా ప్రతి గ్రామంలో క్రీడాప్రాంగణాలను ఏర్పాటు చేయడంతోపాటు కిట్లను అందిస్తున్నట్లు తెలిపారు. గతంలో ఎన్నడూలేని విధంగా ఇండ్లు నిర్మించుకునే ప్రతిఒక్కరికీ గృహలక్ష్మి పథకం ద్వారా రూ.3 లక్షల ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే దరఖాస్తులు చేసుకున్నవారికి గృహలక్ష్మి ప్రొసీడింగ్ పత్రాలు అందజేశామన్నారు. ఇంకా ఎవరైనా ఉంటే అందరికీ గృహలక్ష్మి పథకం మంజూరు చేస్తామన్నారు. గ్రామాలను పట్టణాలకు దీటుగా అభివృద్ధి చేశామన్నారు. పనిచేసే ప్రభుత్వాన్ని, సీఎం కేసీఆర్‌ను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలేశంగౌడ్, జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ రంగారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, గజ్వేల్ ఏఎంసీ వైస్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ భగవాన్, మండల కో–ఆప్షన్ సభ్యుడు ఎక్బాల్, రైతుబంధు సమితి అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, నాయకులు కరుణాకర్, సంతోష్‌రెడ్డి, ఆంజనేయులు, బాలకిషన్, సర్పంచులు, ఎంపీటీసీలు, యువకులు పాల్గొన్నారు.



కానిస్టేబుల్ ఉద్యోగం సాధించిన షేక్‌బాబాను సన్మానిస్తున్న మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అనిత

## పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు

హుస్నాబాద్ టౌన్, అక్టోబర్ 7 : పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అనిత అన్నారు. పట్టణంలోని నాలుగో వార్డుకు చెందిన షేక్‌బాబా ఇటీవల రిజర్వ్‌డ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించడంతో శనివారం పట్టణంలో అతడిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగానికి పేదరికం అడ్డుకాదని, కష్టపడితే విజయం సాధించవచ్చని చెప్పారు.

## అభివృద్ధి పనులు ప్రారంభం



ఐనాపూర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్

కొమురవెల్లి, అక్టోబర్ 7 : మండలంలోని ఐనాపూర్‌లో రూ.5 లక్షల జిల్లా పరిషత్ నిధులతోపాటు రూ.25 లక్షల ఎన్ఆర్‌జీఎస్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం సర్పంచ్ చెరుకు రమణారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు శ్రీరాముల ప్రకాశ్, ఎండీ అబ్జల్, దండు రవీందర్, నాయకులు ఉల్లంపల్లి సాయిలు, బక్కి కిష్టయ్య, కుక్కల సత్తయ్య, బంటు చంద్రం తదితరులు పాల్గొన్నారు.

**సీసీ రోడ్డు పనులకు భూమిపూజ..**

కోహెడ, అక్టోబర్ 7 : మండలంలోని గుండారెడ్డిపల్లిలో సర్పంచ్ ఓరుగంటి అశోక్‌రెడ్డి, ఎంపీటీసీ కల్యాణి సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శనివారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో నాయకులు భూంపెల్లి సంజీవరెడ్డి, బర్మ ఎల్లయ్య, తొగిటి రామబ్రహ్మం, జాలిగాం బాబు, తిరుపతి పాల్గొన్నారు.

## మహేశ్వర్ సేవలు అభినందనీయం

అక్కన్నపేట, అక్టోబర్ 7: మండలంలోని మల్లంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు మహేశ్వర్ సేవలు అభినందనీయమని మండల విద్యాధికారి నర్సింహారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మల్లంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మహేశ్వర్ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా స్కూల్ అసిస్టెంట్ గణిత ఉపాధ్యాయుడు మహేశ్వర్‌కు ప్రధానోపాధ్యాయుడిగా సిరిసిల్ల జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో మహేశ్వర్ ఉత్తమ సేవలందిస్తున్నారని కొనియాడారు. ఇప్పటికే పలుమార్లు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ఆయన అందుకున్నారని చెప్పారు. భవిష్యత్‌లో మరింత మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం మహేశ్వర్‌ను ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రంగనాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేత

చేర్యాల, అక్టోబర్ 7 : మండలంలోని వీరన్నపేట గ్రామానికి చెందిన జంగా రేణుక ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎంపీటీసీ ఎలికట్టె శివశంకర్‌గౌడ్ శనివారం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ మృతురాలి కుటుంబానికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు.

# మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

**ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి**

మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్ 7 : పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నదని ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి అన్నారు. శనివారం మద్దూరు పీహెచ్‌సీలో 'జన ఆరోగ్య సమితి(జేఏఎస్)' ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రైవేట్ దవాఖానల కంటే సర్కారు దవాఖానల్లోనే మెరుగైన వైద్యం అందుతుందన్నారు. గతంలో సర్కారు దవాఖానలను పట్టించుకున్న నాథుడే లేడన్నారు. మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రత్యేక కృషితో రాష్ట్రంలోని అన్ని సర్కారు దవాఖానల్లో వైద్య సౌకర్యాలు మెరుగుపడ్డాయన్నారు. సర్కారు దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తున్నదన్నారు. వైద్యులు ప్రజలకు మెరుగైన సేవలు అందించి వారి మన్ననలు పొందాలని సూచించారు. సర్కారు దవాఖానలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ అనంతరెడ్డి, వైద్యాధికారి రజిత, ఎంఈవో నర్సింహారెడ్డి, పీఆర్ ఏఈఈ వినయ్‌కుమార్‌రెడ్డి, సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కృష్ణారెడ్డి

# లక్ష్య సాధనకు విద్యార్థులు కృషి చేయాలి



మాట్లాడుతున్న డీఐఈవో సూర్యప్రకాశ్

మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్ 7 : విద్యార్థులు లక్ష్య సాధన కోసం కష్టపడి చదవాలని జిల్లా మాధ్యమిక విద్యాధికారి(డీఐఈవో) సూర్యప్రకాశ్ అన్నారు. శనివారం మద్దూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఐఈవో హాజరై మాట్లాడుతూ విద్యార్థులు విలువలతో కూడిన విద్యనభ్యసించాలన్నారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులు కష్టపడి చదివితేనే ప్రయోజనం ఉంటుందన్నారు. జీవితంలో ఇంటర్మీడియెట్ విద్య ఎంతో ప్రధానమైనదని, విద్యార్థులు కేవలం చదువుపైనే దృష్టి సారించాలన్నారు. పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించి తల్లిదండ్రులు, కళాశాలకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. అంతకుముందు ఫ్రెషర్స్ డేలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం అధ్యాపకులను విద్యార్థులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ కంఠారెడ్డి జనార్దన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మంగరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ప్రాజెక్టును సందర్శించిన ఈఎంసీ అధికారులు

కోహెడ, అక్టోబర్ 7 : జిల్లాలోని మధ్యతరహా శనిగరం ప్రాజెక్టును శనివారం ఈఎంసీ వోఎంబీ నాగేందర్‌రావు బృందం సభ్యులు సందర్శించారు. రాగి తూము, మత్తడి పంట కాల్వలను పరిశీలించారు. ప్రభుత్వం వద్ద ఉన్న 30 కోట్ల విలువైన రివైజ్డ్ ఎస్టిమేషన్ నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తానని ఈ సందర్భంగా నాగేందర్‌రావు తెలిపారు. సందర్శించిన వారిలో ఎస్ఈ బస్వరాజు ఈఈలు సాయిబాబా, శ్రీనివాస్, డీఈఈ విద్యాసాగర్, సర్పంచ్ కర్ర జయశ్రీ, మాజీ సర్పంచ్ కర్ర రవీందర్ ఉన్నారు.

## కార్మిక గర్జన కరపత్రాల పంపిణీ

చేర్యాల, అక్టోబర్ 7 : జనగామ జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగే కార్మిక గర్జనకు సంబంధించిన కరపత్రాలను వీరన్నపేట, ముస్త్యాల గ్రామాల్లో శనివారం ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు అందె అశోక్ ఆధ్వర్యంలో నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఈరి భూమయ్య, దండబోయిన వెంకటేశ్, పొన్నబోయిని మహేందర్, భద్రయ్య, పద్మ పాల్గొన్నారు.

# సీఎం కేసీఆర్ పాలనలో సమగ్రాభివృద్ధి

చేర్యాల, అక్టోబర్ 7 : సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రంలోని పల్లెలు సమగ్రాభివృద్ధి చెందాయని సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పెడుతల ఎల్లారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ముస్త్యాల గ్రామంలో సీడీఎఫ్ నిధులు రూ.16 లక్షలతో ఆరోగ్య ఉపకేంద్రం నూతన భవన నిర్మాణం, ఎన్ఆర్‌జీఎస్ నిధులు రూ.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకులు తెలంగాణలో ఏమి జరిగిందని ప్రశ్నించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గ్రామాల్లోకి వచ్చి చూస్తే అభివృద్ధి పనులు కనిపిస్తాయన్నారు. హైదరాబాద్ నగరంలో ఉండే ప్రతిపక్ష నాయకులకు గ్రామాల్లో జరిగిన అభివృద్ధి గురించి ఏం తెలుస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కమర్‌సుల్తానా, ఉపసర్పంచ్ రవితేజ, వార్డు సభ్యులు, పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

**శభాష్‌గూడెంలో..**

మండలంలోని శభాష్‌గూడెం గ్రామంలో రూ.8 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ బొడ్డు స్వప్నాకిరణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో తమ గ్రామం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కనకయ్య, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు గుద్దేటి కనకయ్య, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కనకయ్య, వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

**పెద్దరాజుపేటలో..**

మండలంలోని పెద్దరాజుపేట గ్రామంలో రూ.6 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ నూనె వెంకటేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కేవలం బీఆర్ఎస్‌తోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గర్నెపల్లి రాము, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



ముస్త్యాలలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు ఎల్లారెడ్డి




యుజియా ఫార్మా స్పెషాలిటీస్ లిమిటెడ్ (అరబిందో ఫార్మా లిమిటెడ్ యొక్క అనుబంధ సంస్థ) మేనేజింగ్ డైరెక్టర్ మరియు వైస్ చైర్మన్ శ్రీ కే. సత్యానంద రెడ్డి గారు మరియు **డైరెక్టర్ శ్రీ పి. శరత్ చంద్రారెడ్డి గారు** వారి కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా సిద్దిపేట పట్టణం మరియు చుట్టు ప్రక్కలనున్న అణగారిన గ్రామీణ వర్గాల అభ్యున్నతి కోసం రూ. 7.50 కోట్ల రూపాయలతో సిద్దిపేట్ అర్బన్ మండలం పొన్నాలలో నిర్మించిన మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్‌లో ఒక కోటి రూపాయలు స్పాన్సర్ చేశారు. ఇది 32000ల చదరపు అడుగుల విస్తీర్ణంలో (గ్రౌండ్ + మొదటి అంతస్తు) నిర్మించబడినది. దీనిని తెలంగాణ రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ తన్నీరు హరీష్‌రావు గారు అక్టోబరు 05వ తేదిన ప్రారంభించారు.